క్లుప్తంగా

జగనన్నకు సైనికుల్లా పని చేస్తాం

రాజీనామాలు చేసిన వలంటీర్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో గల వివిధ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న ఐదుగురు మహిళా వలంటీర్లు రాజీనామాలు చేశారు. అనంతరం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి వచ్చి పశ్చిమ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగనన్నకు సైనికుల్లా పనిచేస్తామని వారు ముక్త కంఠంతో చెప్పారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ జనబలం ఉన్న సీఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం, వలంటీర్లు తిరిగి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం ఖాయమని అన్నారు. ఆసిఫ్‌ను కలిసినవారిలో 47వ డివిజన్ 151 సచివాలయం పరిధిలోని ఎం.రేణుక, ఎస్.హారిక, 42వ డివిజన్ 132 సచివాలయ పరిధిలోని పి.పూజిత, 55వ డివిజన్ 173 సచివాలయ పరిధిలో వి.లావణ్య, 44వ డివిజన్ 156 సచివాలయ పరిధిలో వి.దుర్గాలక్ష్మి ఉన్నారు.

బాలుడి వైద్యానికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణాజిల్లా కలిదిండి మండలానికి చెందిన ఊసల భోగేశ్వరరావు, నాగమణి దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. వారి 8 ఏళ్ల కుమారుడు ఊసల దీక్షిత్ మెదడులో ఇన్ఫెక్షన్ ఏర్పడి అది వెన్నుపూస వరకు చేరటంతో నగరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ వార్డ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో బాలుడి తల్లిదండ్రులు దీవెన ఫౌండేషన్ సభ్యులను సహాయం కోసం ఆశ్రయించారు. దీంతో ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు పటమట కానిస్టేబుల్ రమణ, ట్రాఫిక్ కానిస్టేబుల్ నాగేంద్ర, కానిస్టేబుల్ బ్రహ్మం శనివారం హాస్పిటల్‌కు వెళ్లి రూ.10వేలు ఆర్థిక సహాయం అందచేశారు. ఆపదలో ఉన్న పేదవారికి సహాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులకు బాధితుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాతబస్తీలో ఫ్లాగ్‌మార్చ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని ప్రతి ఒక్కరూ శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకుని ఎన్నికలను విజయవంతం చేయాలని వన్‌టౌన్ సీఐ దుర్గశేఖర్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో సంఘ విద్రోహ శక్తులను నిర్మూలించే దిశగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో పారా మిలటరీ, స్థానిక స్టేషన్ పోలీసు సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్ ప్రాంగణం నుంచి బయలుదేరి బోడెమ్మ హోటల్ సెంటర్, రాజారంగయ్యప్పారావు వీధి, నెహ్రూ రోడ్డు, కాళేశ్వరరావు మార్కెట్ బస్ టెర్మినల్, గద్దబొమ్మ సెంటర్, కేజీ మార్కెట్ సెంటర్, బీఆర్టీ రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా సీఐ దుర్గశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు తమ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా నుంచి నగదు డ్రా చేశారంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన బ్యాంకు ఖాతా నుంచి యూపీఐ ద్వారా నగదు డ్రా చేశారంటూ శనివారం గుణదల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. గుణదల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదల కార్మెల్‌నగర్‌కు చెందిన వర్ధం నాగవెంకట నరసింహారావు భార్య పేరు మీద గుణదల యూనియన్ బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. ఈ నెల 19వ తేదీన బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ తీయించుకున్నారు. డిసెంబర్ ఒకటో తేదీన యూపీఐ ద్వారా రూ. 5వేలు డ్రా అయ్యినట్లు ఉంది. అలాగే గతంలో కూడా తమ ఖాతాలోంచి రూ. 25 వేలు కలిశెట్టి కృష్ణ అనే వ్యక్తి ఖాతాకు యూపీఐ ద్వారా డ్రా అయ్యినట్లు ఉంది. దీంతో తన భార్య ఖాతాలోంచి నగదు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ గుణదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈవీఎం స్ట్రాంగ్‌రూం పరిశీలన

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో మే 13న జరుగనున్న ఎన్నికలకు వినియోగించనున్న ఈవీఎంలను భద్రపరిచిన జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ మురళీమోహన్ శనివారం పరిశీలించారు. పోలింగ్ ముగిసే వరకు స్ట్రాంగ్‌రూం వద్ద నిరంతర నిఘా ఉంచాలని ఏసీపీ ఆదేశించారు. అపరిచిత వ్యక్తులు, పాత నేరస్తులు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది విధి నిర్వహణకు సంబంధించిన చార్టులను తనిఖీ చేశారు. తిరువూరు సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పశ్చిమ సీటును జగనన్నకు గిఫ్ట్‌గా ఇస్తా

- స్థానికుడిని... ప్రజలంతా అండగా ఉన్నారు
- పశ్చిమ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



42వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేవుడి దయ, స్థానిక ప్రజల అండతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో గెలిచి ఈ సీటును సీఎం వైఎస్ జగనన్నకు గిఫ్ట్‌గా ఇస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 42వ డివిజన్‌లో శనివారం స్థానిక కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాత హౌసింగ్ బోర్డ్, ఓల్డ్ ఎంజీ కాలనీ ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ డివిజన్‌కు వచ్చిన ఆసిఫ్‌కు ప్రజలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అన్నదమ్ముల వలే కలిసిమెలిసి ఉంటారని, మతతత్వ పార్టీలను పశ్చిమ ప్రజలు ఆమోదించబోరన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు మూటలతో వచ్చే పగటి వేషగాళ్లు, పెత్తందారులను అంగీకరించబోరని స్పష్టంచేశారు. ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్న స్థానికుడనైన తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, తంగెళ్ల రాము, విశ్వనాథ రవి, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మజ్జి శీను, బూదాల శీను, తిరుపతి రెడ్డి, రోస్‌రెడ్డి, అజీజ్, భవాని తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్‌పై మోదీతో స్పష్టత ఇప్పించగలరా?

- రీకాల్ విధానంలో మొదటి వేటు సుజనాపైనే
- ఎంపీ కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత



ప్రచారంలో భాగంగా ప్రజలతో కేశినేని శ్వేత, రెహమతున్నీసా, నీలోఫర్, హయాత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ముస్లిం మైనార్టీ రిజర్వేషన్ రద్దు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర బీజేపీ నాయకులు బాహాటంగానే ప్రకటించడంపై ముస్లిం సామాజికవర్గం మొత్తం నివ్వెరపోతోందని విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. వచ్చే నెల 3న ప్రధాని మోదీ విజయవాడకు రానున్నారని ప్రచారం చేసుకుంటున్న కూటమి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి ముస్లిం మైనార్టీ రిజర్వేషన్స్‌పై మోదీతో స్పష్టత ఇప్పించగలరా అని సవాల్ విసిరారు. విద్యాధరపురంలో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, ఆమె తనయుడు, వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్-నీలోఫర్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కేశినేని శ్వేత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ గెలుపును కాంక్షిస్తూ వారు గడప గడపకు వెళ్లి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఇక అభివృద్ధి విషయానికి వస్తే సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే విజయవాడ నగరం, ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని తెలిపారు.

రీకాల్ విధానం వస్తే మొదట సుజనా చౌదరినే పిలవాలి

పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి కోరుకుంటున్నట్లుగా ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రజాప్రతినిధులను రీకాల్ చేసే విధానం వస్తే ముందుగా అతన్నే వెనక్కి పిలవాలని కేశినేని శ్వేత అన్నారు. ఎందుకంటే 12 ఏళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ఉన్న సుజనా చౌదరి విజయవాడ నగరానికి ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యులకు కేంద్రం ప్రతి ఏటా కేటాయించే రూ.60 కోట్లలో విజయవాడకు ఎంత ఖర్చు చేశారని ప్రశ్నించారు. సుజనా చౌదరి వంటి పొలిటికల్ టూరిస్ట్ వలన నియోజకవర్గానికి ఒనగూరేదేమీ లేదని చెప్పారు. సీటు కోసం వందల కోట్లు ఖర్చు చేసే సుజనా వంటి పెత్తందార్లు రేపు పొరపాటున గెలిస్తే అంతకు మించి దోచుకునేందుకే తప్ప ప్రజాసేవకు కాదని అన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో సమస్య వస్తే ముందుగా తలుపు తట్టేది కేశినేని భవన్‌దని, నగరంలో రెండు ఫ్లైఓవర్‌లను సాధించిన ఘనత కేశినేని నానిదేనని అన్నారు. అభివృద్ధిని కాంక్షించేవారు రానున్న ఎన్నికల్లో కేశినేని నానితో పాటు నిరంతరం ప్రజల మధ్య ఉండే పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ అనీస్, ఎస్‌కే నజీర్, బి.శాంతి, ఈశ్వర్(ఈసు), అబ్దుల్ రవూఫ్, దాదా, నేలంగి నరసింహారావు, విజయ్, మంటి రాము, పితాని వెంకటరావు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో టీడీపీ కూటమిని తరిమికొట్టాలి

- జగన్‌తోనే మైనార్టీల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ
- టీడీపీ కూటమి వస్తే మైనార్టీల రిజర్వేషన్లు గల్లంతు
- కర్నూలు శాసనసభ్యుడు హాఫీజ్‌ఖాన్



సభలో మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్, చిత్రంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, కేశినేని శ్వేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలోని మైనార్టీ వర్గాలన్నీ రాష్ట్రంలోని టీడీపీ కూటమి అభ్యర్థులను తరిమికొట్టాలని కర్నూలు శాసనసభ్యుడు హాఫీజ్‌ఖాన్ అన్నారు. ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈద్‌మిలాప్ కార్యక్రమాన్ని స్థానిక ముసాఫిర్‌ఖానా ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు హాఫీజ్‌ఖాన్‌తో పాటు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని కాపాడుకోవటం ద్వారా ముస్లిం మైనార్టీలకు రానున్న కాలంలో మరింత మేలు జరుగుతుందన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మైనార్టీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను గెలిపించి అసెంబ్లీకి పంపించాలని విజ్ఞప్తి చేశారు. షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలో ఏడు స్థానాల్లో మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. వారందరూ తన లాగా సామాన్యులేనన్నారు. ముస్లిం వర్గాలకు ఇంత పెద్ద సంఖ్యలో సీట్లు కల్పించి గౌరవించిన ముఖ్యమంత్రి మరొకరు లేరని చెప్పారు. ముస్లిం వర్గాలు తనకు అండగా ఉండాలని కోరారు. సుజనాచౌదరిని గెలిపిస్తే ముస్లింల రిజర్వేషన్లను వదులుకున్నట్లేనని, నల్ల చట్టాలకు స్వాగతం చెప్పినవారవుతారని అన్నారు.

ఎంపీ కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత మాట్లాడుతూ తన తండ్రి గడిచిన ఐదేళ్లలో ముస్లిం వర్గాలకు అండగా ఉన్నారన్నారు. పార్లమెంట్‌లో ముస్లిం వర్గాలకు వ్యతిరేకంగా ఏ బిల్లు వచ్చినా దానిని వ్యతిరేకించారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఆసిఫ్‌ను, కేశినేని నానిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సభకు సంస్థ అధ్యక్షుడు హబీబుల్ రెహ్మాన్ అధ్యక్షత వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జీఎంసీ బాషా, డాక్టర్స్ సెల్ చైర్మన్ మెహబూబ్ షేక్, కార్పొరేటర్లు అర్షద్, ఇర్ఫాన్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరాల ఆత్మీయ సమ్మేళనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ నగరాల కులస్తుల రాష్ట్ర బీసీ సాధన కమిటీ ఆధ్వర్యంలో నగరాల సామాజికవర్గ ఆత్మీయ సమావేశం ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కేఎస్ జగన్ తెలిపారు. నగరాల సామాజికవర్గానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనేక రకాలుగా మేలు చేసిందని చెప్పారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తొలిగా తమను బీసీలుగా గుర్తించి తమ అభివృద్ధికి బాటలు వేశారని, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు రాజకీయంగా ఉన్నత పదవులు కేటాయించి రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారని అన్నారు. అటువంటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నగరాల ఆత్మీయ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు కొరగంజి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: పోరంకిలో పరీక్షలు రాసేందుకు వచ్చిన డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పటమటకు చెందిన విద్యార్థిని(20) పటమటలోని త్రివేణి కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. ఆమె ఈ నెల 26న పరీక్ష రాయటానికి పోరంకిలోని శ్రీ కృష్ణవేణి డిగ్రీ కాలేజీకి వచ్చి పరీక్ష రాసింది. ఆ తరువాత ఆమె తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రతి ఇంటికీ ఓటరు స్లిప్పులు అందిస్తాం


విజయవాడరూరల్: మైలవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలంలోని ఓటర్లకు బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ చేస్తామని అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఓటరు ఇంటికి బీఎల్వోలు వెళ్లి ఓటరు స్లిప్పులను నెలాఖరులోగా అందజేయాలన్నారు. మండలంలో 26,755 మంది పురుష ఓటర్లు, 28,765 మంది మహిళా ఓటర్లు, 10 మంది ట్రాన్స్ జండర్స్ ఉన్నారని చెప్పారు. వారందరికీ 52 మంది బీఎల్వోలు స్లిప్పులు అందిస్తారన్నారు.

సంక్షేమ సారథికి జేజేలు

నవరత్నాల పథకాలను కొనసాగిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ తాను ఆచరణలో చేయగలిగినవి మాత్రమే చెప్పారు. ఆచరణ సాధ్యం కాని హామీలను ఇవ్వలేదు. కేవలం ఓట్ల కోసం తలకు మించిన భారాన్ని మోయలేనని, అబద్ధపు హామీలు ఇవ్వలేనని ఆయన చెప్పడం ఆయన నిజాయతీకి నిదర్శనమని మేధావులు ప్రశంసిస్తున్నారు. సంక్షేమ సారథికి జేజేలు పలుకుతున్నారు.

–చిట్టినగర్(విజయవాడ పశ్చిమ)


చెప్పారంటే చేస్తారనే నమ్మకం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రతి వర్గానికి అందాయి. జగన్ తాను చేసే పనులను మేనిఫెస్టోలో పెట్టారంటే అవి కచ్చితంగా అమలు జరిగినట్లేననే నమ్మకం ప్రజల్లో ఉంది. ఈ ఐదేళ్లు ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో, రానున్న ఐదేళ్లు కూడా ఆ సంతోషం రెట్టింపవుతుంది.

– ఖాజామొయిద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు


మైనార్టీల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను పవిత్ర ఖురాన్‌తో సమానంగా చూస్తుంది. జగన్ మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారు. మా అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని భావిస్తున్నాం. మేనిఫెస్టోలో తాను చేసేదే చెప్పడం జగన్‌కు అలవాటు. విపక్షాలు అధికారం కోసం అలవికాని మోసపూరిత హామీలను ఇస్తున్నారు.

– షేక్ ఖాజా, వైఎస్సార్ సీపీ కార్యకర్త

సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట



2019 మేనిఫెస్టోతో ప్రభంజనం సృష్టించి ఎన్నికల్లో 151 సీట్లు గెలిచి ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు ఆ పథకాలను కొనసాగిస్తూ ప్రజలకు ఇస్తున్న లబ్ధిని, సంక్షేమం, అభివృద్ధిని సమ్మిళితం చేస్తూ మేనిఫెస్టో 2.0ను విడుదల చేశారు. కేవలం మేనిఫెస్టో ప్రకటించడమే కాకుండా దానిని అమలు చేసేందుకు సీఎం జగన్ ఎంతగా కృషి చేశారో అందరికీ తెలుసు. ఈ ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ అఖండ విజయానికి మేనిఫెస్టో మరింత దోహదపడుతుంది.

–షేక్ మెహరాజ్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి

ముమ్మరంగా వాహన తనిఖీలు



కంకిపాడు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ డి.సందీప్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు, గన్నవరం డీఎస్పీ ఆర్. జయసూర్య నిర్దేశకత్వంలో సీఐ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో దావులూరు టోల్‌గేట్ వద్ద పోలీసులు, కేంద్ర బలగాలు, ఎన్నికల ప్రత్యేక బృందాలు శనివారం వాహన తనిఖీలను నిర్వహించాయి. విజయవాడ-మచిలీపట్నం మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ సందీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. నగదు, వస్తు సామగ్రి తరలింపులో సరైన ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలని, లేని పక్షంలో నగదు, సామగ్రి సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీది ఆచరణాత్మక మేనిఫెస్టో

షేక్ ఆసిఫ్



ముఠా కార్మికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పూర్తిగా ఆచరణాత్మకంగా ఉందని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోపై ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఇచ్చిన హామీలను 99 శాతం నిలబెట్టుకొని నేను చేసిన మేలు నచ్చితేనే నాకు ఓటు వేయండని ధైర్యంగా అడిగిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇది జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం అని అన్నారు. మేనిఫెస్టోలో ఎక్కడా ఆచరణ సాధ్యం కాని హామీ ఒక్కటి కూడా లేదన్నారు.

అభివృద్ధికి అండగా ఉండే మేనిఫెస్టో

కేవలం సంక్షేమమే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి చాలా స్పష్టమైన ముందు చూపు కలిగిన నేత జగన్‌మోహన్ రెడ్డి అని ఆసిఫ్ అన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో పోలవరం పూర్తి చేస్తామనే భరోసా ఇచ్చారన్నారు. విశ్వవిద్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న మూడు వేలకు పైగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తానని చెప్పారని వివరించారు.

చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలి

రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే జగన్ రాష్ట్రాన్ని శ్రీలంకగా మారుస్తున్నారని పదేపదే చెప్పిన చంద్రబాబు ఆచరణయోగ్యం కాని హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. మేనిఫెస్టో విషయంలో జగన్ చిత్తశుద్ధి, నిజాయతీ చూసి చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలన్నారు.

విశ్వసనీయతకు ప్రతీకగా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో

–వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విలువలు, విశ్వసనీయతతో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించి విడుదల చేసిన పార్టీ మేనిఫెస్టో విశ్వసనీయతకు ప్రతీకగా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించే విధంగా ఉన్న ఈ మేనిఫెస్టో వారి అభ్యున్నతికి దోహదపడుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓట్లు వేసి సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు.

కాపులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన జగన్

షేక్ ఆసిఫ్



నరహరిశెట్టి శ్రీహరిని సత్కరిస్తున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో కాపు సామాజికవర్గానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నరహరిశెట్టి శ్రీహరి ఆసిఫ్‌ను వించిపేటలోని ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫ్ నరహరిశెట్టి శ్రీహరిని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో సుమారు 33 మందికి అసెంబ్లీ అభ్యర్థులుగా సీట్లు కేటాయించారని, అలాగే ఐదుగురికి ఎంపీ స్థానాలకు అవకాశం కల్పించారన్నారు. అనేక కీలక పదవుల్లో కాపులకు అవకాశం కల్పించారని వివరించారు. నరహరిశెట్టి శ్రీహరి మాట్లాడుతూ తనకు పదవి లభించేందుకు అండగా నిలిచిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, షేక్ ఆసిఫ్ ఇతర పార్టీ పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బెజవాడ బార్ అసోసియేషన్ నేత నరహరిశెట్టి జ్యోతి పాల్గొన్నారు.

యాగశాలలో గణపతికి అభిషేకాలు, హోమం



గణపతి హోమంలో పాల్గొన్న ఈవో రామరావు దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై నూతన యాగశాలలో శనివారం గణపతికి విశేష అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. శనివారం ఉదయం యాగశాలలో గణపతి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ, అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్చారణ, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారికి అర్చన నిర్వహించగా, ఆలయ ఈవో కేఎస్ రామరావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ మూర్తి, కోట ప్రసాద్, మురళీధర్ శాస్త్రి, రఘునాథ శర్మ(పండు) అభిషేకాలు, పూజ, గణపతి మంత్ర హోమాలను జరిపించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం, వేద ఆశీర్వచనం, ప్రసాద వితరణ జరిగాయి. పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు.

మధురంగా సాగిన ఐశ్వర్య గాత్ర కచేరి



సంకీర్తనలను గానం చేస్తున్న ఐశ్వర్య, వాద్య సహకారం అందిస్తున్న శ్రీనివాసమూర్తి, సూర్య

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో లబ్బీపేట పైడయ్యవీధిలోని మహతి మినీ ఆడిటోరియంలో యువ సంగీత విద్వాంసురాలు ఎ.ఐశ్వర్య నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. నారాయణ తీర్థుల తరంగం జయ జానకీ కాంత, అన్నమాచార్య సంకీర్తన భావయామి, త్యాగరాజ స్వామి కీర్తన వాసుదేవయని, భద్రశైల రాజమందిర తదితర కీర్తనలను ఆలపించారు. వయొలిన్‌పై గండూరి శ్రీనివాసమూర్తి, మృదంగంపై సీహెచ్ సూర్య సహకరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మే 13 వ తేదీనుంచి వారం రోజులపాటు శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో సద్గురు త్యాగరాజ స్వామి 257వ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి సంగీత విద్వాంసులతో పాటు యువ సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామికి కృతుల సమర్పణ చేస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.

అలరించిన భరత నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై చెన్నైకి చెందిన మైత్రి సెంటర్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన నృత్యకారులు ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శనివారం సాయంత్రం మైత్రి సెంటర్‌కు చెందిన అధితి అరుణ్, దీక్షిక అరుణ్, ఆర్.స్వాతి, ఆర్.శ్వేత, బి.నివాసిని, ఆర్.శ్రీజ, గాయత్రి ఆనంద్, సాయిశ్రేయ, అభినయ, దీపిక పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం వారికి అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.